## క్లుప్తంగా

### కోన వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



కోన వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారి

సి.బెళగల్:మండల పరిధిలోని కృష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోన వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలిమంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు. పూజా కార్యక్రమాలలో స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారికి పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### పరామర్శ



ఎద్దుల మహేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : గుండె సంబంధిత చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డిని శనివారం కోడుమూరులో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్ పరామర్శించారు. ఆయనతో పాటు కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్ రెడ్డి, ముల్లా సలీం తదితరులు ఉన్నారు.

### గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ప్రకాష్

సి.బెళగల్: ప్రజలు ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి ప్రకాష్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, పుస్తకాల ర్యాక్‌లను, వార్తా దిన పత్రికలను, వార పత్రికలను పరిశీలించారు. శాఖా రికార్డుల నిర్వహణ విధానాలను లైబ్రేరియన్ వెంకటరమణను అడిగి తెలుసుకుని ఆయనకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ సంస్థల నుంచి పెండింగ్‌లో గ్రంథాలయ నిర్వహణ సెస్సులను అధికారులు చెల్లిస్తే బాగుంటుందన్నారు. సి.బెళగల్ శాఖకు దాదాపు రూ.21 వేల వరకు బకాయిలు ఉందని, పంచాయతీ అధికారులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

### కురువలకు ఎస్సీ హోదా ఇవ్వొద్దు



డీటీ పురుషోత్తంకు వినతిపత్రం ఇస్తున్న మారందొడ్డి ఎస్సీ యువకులు

సి.బెళగల్: మాదిసి, మాదారి కురువ కులస్తులకు ఎస్సీ హోదా ఇవ్వొద్దంటూ మారందొడ్డి గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన యువకులు డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) పురుషోత్తంకు వినతిపత్రం ఇచ్చారు. శనివారం గ్రామానికి చెందిన యువకులు రూబేన్, ప్రమోద్‌బాబు, తేజ, సునీల్ మరో 20 మందితో కలిసి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మాదాసి కురువ/మాదారి కురువ అంటూ ఎస్సీ కులం పేరుతో కురువలు ఎస్సీ కులం సర్టిఫికెట్లు అడుగుతున్నారన్నారు. అలాంటి వారిపై తగు చర్యలు తీసుకుని, వారికి ఎస్సీ కుల సర్టిఫికెట్లు జారీ కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. తిప్పన్న, చిన్నబాబు, జీవన్‌కుమార్, మధుసుదన్‌రావు, చందు తదితరులు ఉన్నారు.

### నేడు మహిళలకు ఉచిత వైద్యశిబిరం

కర్నూలు(హాస్పిటల్): మహిళలకు ఈనెల 5న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందన్నారు.

# ప్రమాదాలు నియంత్రించరూ!



☛ గార్గేయపురం గ్రామంలో దిగువపాడు రోడ్డులో వాటర్‌ప్లాంటు సమీపం, సొసైటీ ఎదురుగా ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డుకు దగ్గరగా ఏర్పాటు చేశారు. ఫ్యూజు బోర్డులు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. విటి దిమ్మెలు కూడా శిథిలావస్థకు చేరాయి. ఇక్కడ రోడ్డు ఎప్పుడు రద్దీగా ఉంటుంది. స్కూల్ పిల్లలు ఎక్కువగా ఇక్కడే ఆయా గ్రామాల బస్సుల కోసం వేచి ఉంటారు. ఈ రోడ్డు మీదుగా సమీప గ్రామాలకు వెళ్లే వాహనదారులు రాత్రి సమయాల్లో, వర్షం పడేటపుడు ప్రమాదదాల బారి నపడే అవకాశం ఉంది. ఇక్కడ గతంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆవు, మేకలు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాయి. అయినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు.

- గ్రామాల్లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- రక్షణ గోడలు కరువు
- తక్కువ ఎత్తులోనే ఫ్యూజ్ బోర్డులు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



గార్గేయపురం గ్రామంలో పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్ల కంపలు



పడిదెంపాడు గ్రామంలో ఓ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న తీగ



అర్. కొంతలపాడు గ్రామంలో తక్కువ ఎత్తులో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్ ఫార్మర్

కర్నూలు (రూరల్) : మండల పరిధిలో పలు గ్రామాలలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు పక్కన, జనానాసాల మధ్యనే ఏర్పాటు చేశారు. అయితే వాటికి రక్షణ కంచె వేడయం మరవడంతో రాకపోకలు సాగించేవారు, జంతువులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా తగిలేలా వున్నాయి. గతంలో ట్రాన్స్‌ఫార్మర్‌లకు తగిలి మూగజీవాలు మృతిచెందిన ఘటనలూ ఉన్నాయి. ట్రాన్స్ ఫార్మర్లకు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా స్థానిక లైన్‌మెన్లు, విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు.

#### అల్లుకున్న తీగలు

మండలం పరిధిలోని జి.సింగావరం, ఉల్చాల, వెంకాయపల్లె, పడిదెంపాడు, గార్గేయపురం ఇలా చాల గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. పొలాల వద్ద, జనావాసాల మధ్య, రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్ పార్మర్లకు తీగలు అల్లుకోవడం, చుట్టూ చెట్లు, ముళ్ల పొదలు పెరగడంతో వాటి మధ్యలో చిక్కుకుపోయాయి. కొన్ని చోట్ల అవి కనిపించకుండా మొక్కలు కప్పేశాయి. ఇది గమనించకుండా వెళ్తే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. అలాగే మూగజీవాలు మేసేందుకు వెళ్లి విద్యుదాఘతం బారిన పడే ప్రమాదం లేకపోలేదు. ట్రాన్స్‌ఫార్మర్లు తగిలి జంతువులు మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రమాదాలు పొంచి ఉన్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పొలాల వద్ద వున్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంపచెట్లు, తీగలు ఉంటే వాటిని రైతులే తొలగించుకోవాలని గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారు.

#### రాకపోకలకు జంకుతున్న జనం..

ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు వాటికి ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బోర్డులు కూడా తక్కువ ఎత్తులోనే ఉన్నాయి. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వలన రాకపోకలు సాగించే వాహనదారులు జంకుతున్నారు. అటువైపుగా పశువులను, రైతుల ఎద్దుల బండ్లను తీసుకెళ్లడానికి భయపడుతున్నారు. మేతకు వచ్చిన పశువులు మేస్తూ ఆదమరిచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిలేతే పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు.విద్యుత్ అధికారులు అప్పుడప్పుడైనా ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి పిచ్చి మెక్కలు అల్లుకోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఆటు వైపు కన్నెత్తి చూడడంలేదు.

#### రచ్చబండ వద్ద ప్రమాదకరంగా



మా గ్రామంలో రచ్చబండ పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ప్రధాన కూడలి అవ్వడంతో ప్రజలు ఇక్కడే ఉంటారు. రచ్చబండ ఉండటం వలన పెద్దవారు ఇక్కడ ఎక్కువగా గుమికూడతారు. వర్షలు పడుతున్నప్పుడు, గాలులు వీచినప్పుడు భయంగా ఉంటుంది. గ్రామంలో స్కూల్ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు ఇక్కడ మలుపు తిరగడం కష్టంగా ఉంటుంది. ఆధికారులకు సమస్యపై ఎన్ని సార్లు వినతి పత్రాలు అందజేసినా స్పదించడం లేదు.

– రఘవేంద్ర. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు. ఉల్చాల గ్రామం

#### మలుపులో ప్రమాదం



జి.సింగవరం గ్రామం మీదుగా అర్.కొంతలపాడు,సుంకేసుల, ఎదురూరు, కొత్తకొట గ్రామాలకు వెళ్ళె రోడ్డు సమీపాన కె.సి.కెనల్ వంతెన మలుపు దగ్గర ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేశారు. పశుగ్రాసం తరలించే ట్రాక్టర్లు, బస్సులు, లారీలు, వాహనదారులకు ప్రమాదకరంగా ఉంటుంది. రోడ్డు మీదుగా ఎన్నో గ్రామాలకు ప్రయాణం సాగించే వాహనదారులు రాత్రి సమాయల్లో ఇబ్బంది పడు తుంటారు. ఆదమరిస్తే ట్రాన్స్‌ఫార్మను గుద్దుకునే అవకాశం ఉంది. సమీపాన హైస్కూల్ కూడా వుండటంతో పిల్లలకు ఇబ్బందిగా ఉంటుంది.

– సురేష్, జి. సింగవరం

#### ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం



ప్రమాదకరంగా వున్న ట్రాన్స్‌పార్మర్‌ను విద్యుత్ శాఖ సిబ్బంది నిత్యం పరిశీలిస్తూవుంటారు. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరస్థితిలో వున్నాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తాం. అవసరమైతే ట్రాన్స్‌ఫార్మర్‌లను వేరే చోటికి మార్చడనికి చర్యలు తీసుకుంటాం. కోన్నిచోట్ల దిమ్మెలు శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో కొత్త దిమ్మెలు ఏర్పాటు చేసేందుకు ఎస్టిమేషన్ తయురు చేస్తూన్నాం. తొందరలోనే పనులు ప్రారంభిస్తాం.

– మహమ్మద్ ఇస్మాయిల్, విద్యుత్ ఏఈ, కర్నూలు మండలం

### భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రాజెక్టులో మరోమారు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం గగ్గటూరు గ్రామంలో రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులకు ఎల్‌పీ నంబర్లు, సర్వే నంబర్లు, పొలం సర్వేలో మార్పులు, కొలతలు తేడాలు, జాయింట్ ఎల్‌పీలు, తదితర వాటిపై రైతులకు వివరించారు. అనంతరం రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

#### సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు(రూరల్): భూ సమస్యల పరిష్కరమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ సూచించారు. మండల పరిధిలో గార్గేయపురం గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించి, ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. వివిధ భూ సమస్యలపై 30 మంది రైతులు అర్జీలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు మహానంది, వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### హైందవ శంఖారావం ర్యాలీ

కోడుమూరు రూరల్ : హిందువుల భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఆదివారం విజయవాడలో జరిగే హైందవ శంఖారావ సభకు కోడుమూరు నుంచి భారీగా వీహెచ్‌పీ నాయకులు, ప్రజలు శనివారం సాయంత్రం తరలివెళ్లారు. కోడుమూరులోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నుంచి శ్రీరాములవారి దేవాలయం వరకు వీహెచ్‌పీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడి నుంచి 25వాహనాల్లో బయలుదేరారు. ర్యాలీని వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక వీహెచ్‌పీ నాయకులు కిరణ్, శ్రీనివాసులు, శంకర్, ప్రతాప్‌రెడ్డి, నటరాజ్, విఠల్, తాయప్ప, ఈశ్వర్ రెడ్డి, మయూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్షుద్ర పూజల కలకలం



క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు

గడివేముల: మండలంలోని చిందుకూరు గ్రామ సమీపంలోని కుందూ దగ్గరలోని పొలాలకు వెళ్లే మూడు రస్తాల వద్ద క్షుద్ర పూజలు కలకలం రేపాయి.శనివారం పసుపు, కుంకుమలతో దీర్ఘచతురస్రాకారంలో ముగ్గు వేసి అందులో కొన్ని ఆకారాల బొమ్మలు గీచి పూజలు చేసినట్లు రైతులు గుర్తించారు. అక్కడ ఓ దిష్టిబొమ్మను కూడా కాల్చివేసిన ఆనవాళ్లు కనిపించాయి. క్షుద్ర పూజల వాసన రాకుండా అక్కడ సెంటు ఉంచారు. కొన్ని రోజుల నుంచి గ్రామంలో క్షుద్ర పూజలు నిర్వహిస్తుండటంతో ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

### టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు సమయానుసారం టీకాలు వేయిస్తే వారికి భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధులు రాకుండా కాపాడవచ్చని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. శనివారం స్థానిక బండిమెట్ట యూపీహెచ్‌సీ పరిధిలోని మొగల్పుర 6వ సచివాలయంలో వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ పిల్లలకు ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే పట్టించాలని, ఏడవ నెల నుంచి అనుబంధ ఆహారం తినిపించాలని సూచించారు. వాతావరణంలో మార్పుల వల్ల చలితీవ్రత ఎక్కువగా ఉన్నందున పిల్లలకు న్యూమోనియా నుంచి రక్షణ కోసం వెచ్చగా ఉండేటట్లు దుస్తులు వేయాలని చెప్పారు. పిల్లలకు ఏదైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆరోగ్య కార్యకర్త, డాక్టర్ వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు నాగరాణి, వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్తలు సవిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

### ఆలస్యంగా మధ్యాహ్న భోజనం

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని మధ్యాహ్నం 1.10గంటలకు పెట్టాల్సి ఉంది. అయితే ఎమ్మెల్యే కార్యక్రమానికి ఆలస్యంగా 1.30గంటలకు రావడం, సభ నిర్వహణ, ఎమ్మెల్యే ప్రసంగమనంతరం ఏకంగా 2.20గంటలకు విద్యార్థులకు భోజనాన్ని పెట్టారు. భోజన సమయానికన్నా గంటన్నరకు పైగా ఆలస్యం కావడంతో కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులు ఆకలితో అలమటించారు. విద్యార్థుల పరిస్థితిని ఏమాత్రం గమనించకుండా అధికారులు, నాయకులు తమ ప్రసంగాలను కొనసాగించడం కొసమెరుపు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు, డీటీ రామాంజినేయులు, ఎంఈఓ తైమూర్‌బాషా, ప్రిన్సిపాల్ పద్మావతి, స్థానిక టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### • పూలతోట కాదు..పొగాకు పంట



కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే దారిలో రైతులు సాగు చేసిన పొగాకు పంట పొలాలు పూల తోటలను తలపిస్తున్నాయి. ఈ ఏడాది జిల్లాలో 6వేలకు పైగా హెక్టార్లలో రైతులు పొగాకు పంటను సాగు చేశారు. ప్రస్తుతం జిల్లాలో రైతులు సాగు చేసిన పొగాకు పంట పూత దశకు చేరుకుంది. మొక్కల నిండా పూలుకాయడంతో చూపలను పూల తోటలా అన్నట్లు భ్రమింపజేస్తున్నాయి.

## నాణ్యమైన విద్యనందించాలి



కొటారుమిట్ట స్కూల్లో విద్యార్థితో పాఠం చదివిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ జ్యోతి సూచించారు. శనివారం మండల పరిధిలోని నదితీర గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముడుమాల మెయిన్, కొత్తకోటలోని రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులను పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థుల నోట్ బుక్‌లను తనిఖీ చేసి, పాఠ్యాంశాల బోధన, తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అలాగే మధ్యాహ్న భోజనంపై హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు, భోజన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా కొత్తకోట గ్రామంలో శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు.

### బెల్లం ఊట ధ్వంసం



బెల్లంఊటను పారబోస్తున్న ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

గడివేముల: మండల పరిధిలోని ఎల్ కే తండా, వైకే తండా గ్రామాల సమీపంలోని ఎర్రమల కొండలలో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎక్సైజ్ సీఐలు కృష్ణమూర్తి, కృష్ణ శనివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 1300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. వారు మాట్లాడుతూ అక్రమంగా నాటు సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటు సారా అమ్మేవారు ఉంటే 80088 28467, 94409 02586 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. దాడుల్లో ఎస్ఐ బ్రహ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### రేపు టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక గుత్తి పెట్రోల్ బంకు వద్ద ఉన్న ఓరియంట్ ఇంగ్లీషు మీడియం స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 6న జిల్లా స్థాయి జూనియర్స్ బాలబాలికల టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు ఉంటాయని టెన్నికాయిట్ జిల్లా కార్యదర్శి రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006 తరువాత జన్మించిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 93938401721 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు సమయానుసారం టీకాలు వేయిస్తే వారికి భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధులు రాకుండా కాపాడవచ్చని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. శనివారం స్థానిక బండిమెట్ట యూపీహెచ్‌సీ పరిధిలోని మొగల్పుర 6వ సచివాలయంలో వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని, ఏడవ నెల నుంచి అనుబంధ ఆహారం తినిపించాలని సూచించారు. వాతావరణంలో మార్పుల వల్ల చలితీవ్రత ఎక్కువగా ఉన్నందున పిల్లలకు న్యూమోనియా నుంచి రక్షణ కోసం వెచ్చగా ఉండేటట్లు దుస్తులు వేయాలని చెప్పారు.

### యమడేంజర్



ఒరిగిన విద్యుత్ స్తంభం పక్కనే రోడ్డు పనులు చేస్తున్న హిటాచీ

కర్నూలు(రూరల్): మండల పరిధిలో గార్గేయపురం నుంచి పసుపల మార్గంలో విద్యుత్ స్తంభాలు ఒరిగి, తీగలు వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. శనివారం రోడ్డు పనుల్లో భాగంగా ఒరిగిన విద్యుత్ స్తంభం వద్ద హిటాచీతో మట్టి చదును చేపట్టడంతో స్తంభం ఎక్కడ పడిపోతుందోనని, తీగలు తగులు తాయేమోనని వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ అధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

## శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు



వాసవీ నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర పరిధిలోని శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అన్నారు. శనివారం పెద్దపాడు, ఎ.నాగులాపురం, వై.జంక్షన్, బి.క్యాంపు, సీ.క్యాంపు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రహదారుల నిర్మాణం, సీ.క్యాంపులోని నగరపాలక వ్యాపార సముదాయంలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. బి.క్యాంపులో స్పీడ్ బ్రేకర్లు ప్రజలకు కనబడే విధంగా సింబల్స్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ క్రిష్ణలత, మనోహర్ రెడ్డి, భానుప్రతాప్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అంజాద్‌బాషా పాల్గొన్నారు.

● మునగాల పాడులోని తాగునీటి సరఫరా పంపింగ్ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## పోలీసులు మీడియా స్వేచ్ఛను అణచివేస్తున్నారు

● సీఎస్‌కు ఫిర్యాదు చేసిన ఏపీడబ్ల్యూజేఎఫ్



సీఎస్ విజయానంద్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పోలీసులు మీడియా స్వేచ్ఛను అణచివేస్తున్నారని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోరంట్లప్ప, జిల్లా కన్వీనర్ కె.నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కర్నూలుకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కర్నూలు సాక్షి రిపోర్టర్‌పై కేసు పెట్టడం, వార్త, ప్రజాశక్తి రిపోర్టర్లకు పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని వారు సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల చర్యలతో మీడియాప్రతినిధులు భయభ్రాంతులకు గురవుతున్నారని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని వారు సీఎస్‌ను కోరారు.

## నియోజకవర్గ నేతలకు ధన్యవాదాలు



వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్‌తో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

సి.బెళగల్: మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులను కలిసి మండలానికి చెందిన ప్రభాకర్‌రెడ్డికి జిల్లా పార్టీ అధికార ప్రతినిధిగా ఎంపిక చేయడంపై ధన్యవాదాలు తెలిపారు. శనివారం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి తదితరులు నియోజకవర్గ నాయకులు మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాగా మండలంలో పార్టీ అభివృద్ధికి మండల నాయకులు కృషి చేయాలని, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని నియోజకవర్గ నేతలు మండల నాయకులకు సూచించారు.